అక్బర్ చక్రవర్తి ఓ రేపిస్ట్: రాజస్థాన్ మంత్రి

జోధ్‌పూర్: మొఘల్ చక్రవర్తి అక్బర్ నిరంకుశ, క్రూర పాలకుడు, మహిళలపై అత్యాచారాలు చేసేవాడు అని రాజస్థాన్ విద్యా శాఖ మంత్రి మదన్ దిలావర్ అన్నారు. ఆయన గొప్పవాడు కాదన్నారు. బజార్ల నుంచి యువతులను తీసుకెళ్లి, వారిపై లైంగికదాడులు చేసేవాడని చెప్పారు. పాఠశాల విద్యార్థుల పాఠ్యాంశాల్లో మార్పుల గురించి ఆదివారం విలేకర్లు ప్రశ్నించినపుడు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. పాఠశాలల్లో విద్యార్థుల చేత సూర్య నమస్కారాలు చేయించడం గురించి ప్రశ్నించినపుడు ఆయన స్పందిస్తూ, దీనిని క్రమంగా అమలు చేస్తామని తెలిపారు.

పాలస్తీనా పీఎం రాజీనామా

జెరూసలెం: పాలస్తీనా ప్రధాని మహమ్మద్ శతాయే సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. అమెరికా మద్దతుతో పాలస్తీనియన్ అథారిటీలో సంస్కరణలు జరగడానికి వీలుగా తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అయితే ఆయన, ఆయన ప్రభుత్వం రాజీనామాలను ఆమోదించడంపై ప్రెసిడెంట్ మహమూద్ అబ్బాస్ ఓ నిర్ణయం తీసుకోవలసి ఉంది. శతాయే రాజీనామాతో పాలస్తీనియన్ అథారిటీని బలోపేతం చేయడానికి అవసరమైన సంస్కరణలకు పాలస్తీనియన్ నేతలు అంగీకరిస్తున్నారనే సంకేతాలు కనిపిస్తున్నాయి.

పాక్‌కు రావి జలాలు బంద్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: జమ్ము కశ్మీర్‌లోని రావి నదిపై భారత్ కొత్త వంతెన నిర్మించింది. దీని వల్ల ఇకపై పాకిస్థాన్‌లోకి ఆ నదీ జలాలు వెళ్లడం ఆగిపోయింది. కొత్త వంతెన కారణంగా స్థానిక పొలాలకు తగినంత సాగునీరు అందనుంది. షాహ్‌పూర్ కంది బ్యారేజ్‌గా పిలిచే ఈ నిర్మాణం వల్ల గతంలో పాకిస్థాన్‌లోకి ప్రవహించే 1150 క్యూసెక్కుల నీటిని కశ్మీర్‌లోని పొలాలకు మళ్లించనున్నారు. ఈ ప్రాజెక్టును జల విద్యుత్తు ఉత్పత్తి కోసం కూడా వాడనున్నారు. జమ్ము కశ్మీర్–పంజాబ్ రాష్ట్రాల మధ్య ఈ ప్రాజెక్ట్ నిర్మాణంపై నాలుగున్నరేండ్లు వివాదం నడిచింది. 1995లో నాటి ప్రధాని పీవీ నర్సింహా రావు ఈ ప్రాజెక్టుకు శంకు స్థాపన చేశారు. 1960లో భారత్–పాక్ మధ్య కుదిరిన ఒప్పందం ప్రకారం రావి, సట్లెజ్, బియాస్ నదులపై పూర్తి నీటి యాజమాన్య హక్కులు భారత్‌కు ఉంటాయి.

‘మగాళ్ల’ మనుగడకు ముప్పు ?!

- భవిష్యత్తులో మగవాళ్ల పుట్టుక ఉండబోదా?
- క్రమంగా కనుమరుగవుతున్న ‘వై’ క్రోమోజోమ్స్
- 900 జన్యువుల నుంచి 55కు పడిపోయిన వైనం
- జపాన్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి



(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): తల్లి కడుపులోని బిడ్డ లింగాన్ని నిర్ధారించడంలో పురుషుల శుక్రకణాల్లోని వై–క్రోమోజోమ్స్ కీలక పాత్ర పోషిస్తాయన్న విషయం తెలిసిందే. అయితే, గడిచిన కొంత కాలంగా ఈ జన్యువుల సంఖ్య అంతకంతకూ తగ్గిపోతున్నదని, రానున్న కాలంలో ఇవి కనుమరుగైనా ఆశ్చర్యపోనవసరం లేదని జపాన్‌లోని హొక్కయిడో యూనివర్సిటీ పరిశోధకుల తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఇదే జరిగితే, భవిష్యత్తులో పురుష జననాలు ఉండకపోవచ్చని పరిశోధకులు అంచనాకు వచ్చారు. అయితే, వైద్యశాస్త్రంలో అమల్లోకి వచ్చిన వినూత్న పద్ధతులు, ఆవిష్కరణల ద్వారా కొత్త జన్యువుల సృష్టితో ఈ సమస్యకు పరిష్కారాన్ని కనుగొనడం అంత పెద్ద కష్టమేమీ కాదని వాళ్లు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ వివరాలు ‘ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్స్’ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

అలా కనుమరుగు..

మనుషులు సహా క్షీరదాల వంటి పాలిచ్చే ఆడ జంతువుల్లో రెండు ‘ఎక్స్’ క్రోమోజోమ్స్ ఉంటాయి. మగవాటిలో ఒక ఎక్స్ క్రోమోజోమ్‌తో పాటు ఒక వై క్రోమోజోమ్ కూడా ఉంటుంది. ఇదే గర్భంలోని శిశువు లింగాన్ని నిర్ధారిస్తుంది. అయితే, పురుషుల్లోని ఎక్స్ క్రోమోజోమ్‌లో *900* వరకూ వివిధ రకాల జన్యువులు ఉండగా, ‘వై’ క్రోమోజోమ్‌లో మాత్రం వాటి సంఖ్య *900* నుంచి *55*కు పడిపోయినట్టు పరిశోధకులు గుర్తించారు. గడిచిన *166* మిలియన్ సంవత్సరాల్లో ఈ మేరకు జన్యువుల క్షీణత జరిగినట్టు తెలిపారు. ఇది ఇలాగే కొనసాగితే రానున్న *11* మిలియన్ ఏండ్లలో ‘వై’ క్రోమోజోమ్‌లోని మిగిలిన *55* జన్యువులు (ఎస్‌ఆర్‌వై జన్యువులు) కనిపించకుండాపోవచ్చని అంచనా వేశారు. ఇదే జరిగితే, గర్భంలోని ప్రతీశిశువు ఆడ శిశువుగానే పుట్టొచ్చని అభిప్రాయపడ్డారు.

అలా జరుగొచ్చు కూడా..

తూర్పు ఐరోపాలో కనిపించే మోల్ వోల్స్ అనే ఎలుక జాతికి చెందిన మగ జంతువులు, జపాన్‌లో కనిపించే మగ స్పైన్ ర్యాట్స్‌లో ఇప్పటికే ‘వై’ క్రోమోజోమ్స్ అంతరించిపోయాయని పరిశోధకులు ఈ సందర్భంగా గుర్తు చేశారు. అయినప్పటికీ, ‘వై’ క్రోమోజోమ్‌లోని జన్యువుల లక్షణాలు కలిగిన మరికొన్ని కొత్త జన్యువులు (ప్యూ జీన్స్) ఆయా మగ జీవుల్లో కొత్తగా పుట్టుకురావడంతో వాటి జాతి పరిణామక్రమం అంతరించిపోలేదని, కొత్తగా మగ పిల్లలు కూడా పుడుతున్నట్టు పరిశోధకులు తెలిపారు. మనుషుల్లోనూ అలాంటి పరిస్థితులు జరుగొచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు.

వయనాడ్‌కు రాహుల్ గుడ్‌బై!

తెలంగాణ లేదా కర్ణాటక నుంచి పోటీచేసే చాన్స్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ కేరళలోని వయనాడ్ సీటును వదిలిపెట్టే అవకాశమున్నది. తెలంగాణ లేదా కర్ణాటకలో ఒక చోట నుంచి బరిలోకి దిగుతారన్న ఊహాగానాలు మొదలయ్యాయి. దక్షిణాదితో పాటు యూపీ నుంచి కూడా రాహుల్ ఎప్పటిలాగే పోటీ చేయనున్నట్టు విశ్వసనీయ వర్గాలు చెప్తున్నాయి. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) ఈ సారి తమ పార్టీకి రెండు కాకుండా 3 సీట్లు కావాలని కాంగ్రెస్‌పై ఒత్తిడి తేవటంతో రాహుల్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ తన ఓటర్లలో అధికులు ముస్లిం సమాజానికి చెందిన వారు కావటంతో వయనాడ్ నుంచి పోటీ చేయాలని కోరుతున్నది. దీనికి తోడు కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (సీపీఐ) పార్టీ ప్రధాన కార్యదర్శి డీ రాజా భార్య అన్నీ రాజాను వయనాడ్ నుంచి పోటీలో దింపింది.

‘తక్కువ పింఛనుతో రిటైర్డ్ జడ్జీలు బతికేదెలా?’

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: రిటైర్డ్ జిల్లా జడ్జీలకు నెలకు రూ.19,000 నుంచి రూ.20,000 మాత్రమే పింఛను లభిస్తున్నదని, ఇంత తక్కువ సొమ్ముతో వారు గౌరవప్రదంగా ఎలా జీవించగలుగుతారని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. జడ్జి పదవిని నిర్వహించిన వ్యక్తి పూర్తిగా అశక్తుడైపోతాడని, 61, 62 ఏళ్ల వయసులో అకస్మాత్తుగా న్యాయవాద వృత్తిని ప్రాక్టీస్ చేయడానికి అవకాశం ఉండదని వ్యాఖ్యానించింది. ఆలిండియా జడ్జస్ అసోసియేషన్ పిటిషన్‌పై విచారణ సందర్భంగా భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ మాట్లాడుతూ, దీనికి సరైన పరిష్కారం రావాలన్నారు. జిల్లా జడ్జీలు చాలా ఇబ్బందిపడుతున్నారన్నారు. ధర్మబద్ధమైన పరిష్కారం కోసం సహాయపడాలని అటార్నీ జనరల్ ఆర్ వేంకట రమణిని కోరారు. సుప్రీంకోర్టు అంతకుముందు స్పందిస్తూ, ప్రతి ఒక్కరూ చట్టానికి లోబడి ఉంటారని ప్రజలు నమ్ముతారని, ఈ నమ్మకాన్ని పరిరక్షించాలంటే న్యాయ వ్యవస్థ స్వతంత్రంగా ఉండాలని తెలిపింది. *జడ్జీలు ఆర్థికపరంగా గౌరవప్రదంగా జీవించగలిగినపుడే ఇది సాధ్యమవుతుందని వివరించింది.*

రాజకీయ పార్టీపైనా పరువునష్టం కేసు వేయొచ్చు

కర్ణాటక హైకోర్టు

బెంగళూరు: పరువు నష్టం కేసుల్లో రాజకీయ పార్టీలు విచారణను ఎదుర్కొనవలసిందేనని కర్ణాటక హైకోర్టు చెప్పింది. కంపెనీలు, ప్రభుత్వాలు వంటి వాటికి వ్యక్తిత్వాన్ని ఆపాదించడం సాధారణ విషయమేనని తెలిపింది. ఇటువంటి వాటికి కీర్తి, ప్రతిష్ఠలు ఉంటాయని, అదేవిధంగా, వాటిపై వచ్చే పరువు నష్టం ఆరోపణల్లో విచారణను ఎదుర్కొనవలసి ఉంటుందని వివరించింది. బెంగళూరులోని శివాజీ నగర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్ బీజేపీపై పరువు నష్టం కేసు దాఖలు చేశారు. దీనిని సవాల్ చేస్తూ బీజేపీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా హైకోర్టు ఈ స్పష్టతనిచ్చింది. అర్షద్‌పై బీజేపీ చేసిన ట్వీట్లు తీవ్రమైనవిగా కనిపిస్తున్నట్లు తెలిపింది.

కోట్లు ఖర్చుపెట్టి 900 మందిని విడిపించాడు

- భారతీయ వ్యాపారి దాతృత్వం
- అతడికి అరబ్ దేశాల సలాం

దుబాయ్, ఫిబ్రవరి 26: అరబ్ ఎమిరేట్స్‌లోని జైళ్లలో మగ్గిపోతున్న ఎందరో ఖైదీలకు ఓ భారతీయ వ్యాపారి కొత్త జీవితాన్ని అందించారు. అందుకోసం ఆయన అక్కడి ప్రభుత్వానికి అక్షరాల రూ.2.25 కోట్లు చెల్లించారు. ఇదంతా ఆయన పరోపకారార్థం చేశారు. వివరాల్లోకి వెళితే.. ముస్లింల పవిత్ర మాసం రంజాన్‌కు ముందు ఎమిరేట్స్‌కు చెందిన భారతీయ వ్యాపారవేత్త 66 ఏండ్ల ఫిరోజ్ మర్చంట్ అసాధారణ నిర్ణయం తీసుకున్నారు. గల్ఫ్ దేశంలోని వివిధ జైళ్లలో మగ్గిపోతున్న 900 మంది ఖైదీలను విడిపించాలనుకున్నారు. తన సొంత సొమ్ము రూ.2.25 కోట్లను అక్కడి ప్రభుత్వానికి విరాళంగా ఇచ్చారు. ఫిరోజ్ మర్చంట్ ప్యూర్ గోల్డ్ జువెల్లర్స్ యజమాని. 2008లో ఏర్పాటు చేసిన ది ఫర్‌గాటెన్ సొసైటీ చొరవతో 2024లో ఇప్పటి దాకా అరబ్ దేశాల్లోని 900 మంది ఖైదీలను ఫిరోజ్ మర్చంట్ విడుల చేయించారు. అంతేకాదు.. ఖైదీలు తమ దేశాలకు వెళ్లటానికి అవసరమైన రవాణా చార్జీలు కూడా తనే భరించారు. ఈ ఏడాది 3వేల మంది ఖైదీలను విడిపించాలని ఫిరోజ్ మర్చంట్ టార్గెట్‌గా పెట్టుకున్నాడట. అతని దాతృత్వానికి ఎమిరేట్స్‌లోని సీనియర్ అధికారులంతా ఫిదా అయ్యారు.

భారతీయునికి ఉజ్బెకిస్థాన్‌లో 20 ఏండ్ల శిక్ష

కలుషిత దగ్గు మందు కేసులో కోర్టు తీర్పు

న్యూఢిల్లీ: కలుషిత దగ్గు మందును వినియోగించడం వల్ల 68 మంది చిన్నారులు మృతి చెందిన కేసులో భారతీయుడు సింగ్ రాఘవేంద్ర ప్రతర్‌కు ఉజ్బెకిస్థాన్ కోర్టు 20 ఏండ్ల జైలు శిక్ష విధించింది. పన్నుల ఎగవేత, నాసిరకం, కలుషిత మందుల అమ్మకం, పదవీ దుర్వినియోగం, నిర్లక్ష్యం, ఫోర్జరీ, లంచం ఇవ్వడం వంటి నేరాలు రుజువైనందుకు ఆయనతోపాటు 23 మందికి రెండేండ్ల నుంచి 20 ఏండ్ల వరకు జైలు శిక్షలు విధిస్తూ తీర్పు చెప్పింది. ఒక్కొక్క బాధిత చిన్నారి కుటుంబానికి రూ.66.30 లక్షల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని ఆదేశించింది.

రష్యా సైన్యం నుంచి భారతీయుల విడుదల

న్యూఢిల్లీ: ఉక్రెయిన్‌తో యుద్ధంలో రష్యా సైనికులకు సహాయక సిబ్బందిగా పని చేస్తున్న కొందరు భారతీయులు విముక్తి పొందారు. భారత్ డిమాండ్ మేరకు వీరిని విడుదల చేశారని భారత విదేశాంగ శాఖ తెలిపింది. చాలా మంది భారతీయులు రష్యన్ మిలిటరీలో సెక్యూరిటీ హెల్పర్స్‌గా పని చేస్తున్నారు. ఉక్రెయిన్–రష్యా సరిహద్దుల్లో కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్న యుద్ధంలో రష్యా సైనికులతో కలిసి పోరాడే విధంగా భారతీయులను నిర్బంధిస్తున్నారు. తమను విడుదల చేయాలని వీరు కోరుతున్నారు.

షాజహాన్‌ను అరెస్ట్ చేయండి

సందేశ్‌ఖాలీ కేసులో హైకోర్ట్ ఆదేశం • వారంలో అరెస్ట్ చేస్తామన్న ప్రభుత్వం

కోల్‌కతా, సందేశ్‌ఖాలీ, ఫిబ్రవరి 26: సందేశ్‌ఖాలీ లైంగిక దాడులు, భూ కబ్జాల కేసులో నిందితుడైన తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) నాయకుడు షాజహాన్ షేక్‌ను అరెస్ట్ చేయాలని ఆ రాష్ట్ర హైకోర్ట్ సోమవారం పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది. అతడిపై దాఖలైన కేసులపై తాము ఎలాంటి స్టే విధించలేదని స్పష్టం చేసింది. నాలుగేండ్ల క్రితమే నిందితుడిపై లైంగిక దాడులు ఆరోపణలు వచ్చినా.. సంబంధిత కేసుల్లో చార్జ్‌షీట్లు దాఖలు చేయడానికి నాలుగేండ్లు పట్టడంపై కోర్టు విస్మయం వ్యక్తం చేసింది. సందేశ్‌ఖాలీవాసుల నుంచి వందలాది ఫిర్యాదులు వెల్లువెత్తిన నేపథ్యంలో బాధితుల ఆరోపణలను కోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది.మరోవైపు హైకోర్టు తీర్పు వెలువడిన వెంటనే తృణమూల్ కాంగ్రెస్ స్పందించింది. న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో షాజహాన్ షేక్‌ను వారంలో అరెస్ట్ చేస్తామని తెలిపింది. దోషులకు తమ పార్టీ మద్దతు తెలపదని వెల్లడించింది.

పాక్‌లో తొలి మహిళా సీఎంగా మరియం నవాజ్

లాహోర్, ఫిబ్రవరి 26: సీనియర్ పీఎంఎల్–ఎన్ నాయకురాలు, మాజీ ప్రధాని నవాజ్ షరీఫ్ కూతురు మరియం నవాజ్(50) పంజాబ్ ప్రావిన్స్‌కు తొలి మహిళా ముఖ్యమంత్రిగా ఎన్నికై రికార్డు సృష్టించారు. సోమవారం జరిగిన ఎన్నికలను ఇమ్రాన్ ఖాన్ మద్దతు కలిగిన సున్నీ ఇత్తెహాద్ కౌన్సిల్ బహిష్కరించింది. అయితే 220 ఓట్లు తెచ్చుకున్న మరియం పాక్‌లో ఒక రాష్ట్రానికి సీఎంగా ఎన్నికైన మొట్టమొదటి మహిళగా చరిత్రకెక్కారు. ఇది ప్రతి మహిళకు లభించిన గౌరవంగా ఆమె అభివర్ణించారు. తనను కష్టాలపాలు చేసి ధృడంగా మారేలా చేసిన ప్రత్యర్థులకు ఆమె ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. వారిపై ప్రతీకారాన్ని తీర్చుకోనని పరోక్షంగా మాజీ సైన్యాధ్యక్షుడు ఖమర్ జావేద్ బజ్వా, సీజేపీ సాకిబ్ నిసార్‌ను ఉద్దేశించి అన్నారు. మరియం ‘శాసన దొంగల రాణి’ అని విపక్ష సభ్యులు నినాదాలు చేశారు.

సీఐఎస్‌సీఈ పన్నెండో తరగతి కెమిస్ట్రీ పరీక్ష వాయిదా

కోల్‌కతా: ది కౌన్సిల్ ఫర్ ది ఇండియన్ స్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామినేషన్స్ (సీఐఎస్‌సీఈ) పన్నెండో తరగతి కెమిస్ట్రీ పేపర్–1 పరీక్ష వాయిదా పడింది. సీఐఎస్‌సీఈ అనుబంధ పాఠశాలల వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం, ఈ పేపర్ పరీక్ష సోమవారం ప్రారంభమవడానికి ముందే సామాజిక మాధ్యమాల్లో లీక్ అయినట్లు తెలియడంతో పరీక్షను వాయిదా వేశారు. అయితే సీఐఎస్‌సీఈ దీనిపై స్పందించలేదు. సీఐఎస్‌సీఈ డిప్యూటీ సెక్రటరీ సంగీత భాటియా పాఠశాలల ప్రిన్సిపాల్స్‌కు ఇచ్చిన సమాచారంలో, సోమవారం జరగవలసిన పన్నెండో తరగతి కెమిస్ట్రీ పేపర్–1 పరీక్షను అనూహ్య పరిస్థితుల్లో మార్చి 21కి వాయిదా వేసినట్లు తెలిపారు.

చిత్రం

మహాభారతం నుంచి మొదలు..

ప్రభాస్ కథానాయకుడిగా నటిస్తున్న సోషియో ఫాంటసీ చిత్రం ‘కల్కి 2898 ఏడీ’ నిర్మాణం నుంచే ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ తుదిదశకు చేరుకుంది. మే 9న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా టీజర్ గ్లింప్స్‌తో పాటు ఇటీవల విడుదల చేసిన ‘జస్ట్ ది వార్మ్ అప్’ వీడియోకు అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న చిత్ర దర్శకుడు నాగ్‌అశ్విన్ సినిమా టైటిల్‌తో పాటు కథాంశంలోని ఆసక్తికరమైన విషయాలను వెల్లడించారు. ఈ సినిమా కథ మహాభారత కాలంలో మొదలై 2898 కాలంలో ముగుస్తుందని చెప్పారు. గతంలో ప్రారంభమై భవిష్యత్తులో ముగుస్తుంది కాబట్టి ఈ టైటిల్ పెట్టామని తెలిపారు. ఆయన మాట్లాడుతూ ‘6000 సంవత్సరాల కాల వ్యవధిలో జరిగే కథ ఇది. భూత, భవిష్యత్ కాలాలను ఆవిష్కరిస్తూ ఓ సరికొత్త ప్రపంచాన్ని సృష్టించాం. ప్రతి సన్నివేశంలో భారతీయత ఉట్టిపడుతుంది. హాలీవుడ్ సైన్స్ ఫిక్షన్ చిత్రం ‘బ్లేడ్ రన్నర్’తో ఈ సినిమాకు ఎలాంటి పోలికలు ఉండవు. ఈ సినిమా ఛాయలు ఏమాత్రం కనిపించకుండా జాగ్రత్తలు తీసుకున్నాం’ అని చెప్పారు. ఈ చిత్రంలో అమితాబ్‌బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పడుకోన్ వంటి అగ్ర తారలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

వాళ్లు నాలో రామలక్ష్మిని చూడలేకపోయారు

సమంత తెలుగుతెరకు పరిచయమై నిన్నటికి సరిగ్గా పద్నాలుగేళ్లు. 14ఏళ్ల క్రితం అదే రోజున ‘ఏ మాయ చేశావే’ విడుదలైంది. అందులో సమంతను చూసి యువతరం హృదయాలు బరువెక్కాయి. అయితే.. తను తెలుగు సినిమాను ఏలుతుందని మాత్రం అప్పుడు ఎవరూ ఊహించలేదు. తొలి సినిమాలో క్లాస్‌గా కనిపించిన సామ్.. కాలక్రమేణ మాస్ హీరోయిన్‌గా వెండితెరపై మెరుపులు మెరిపించింది. ముఖ్యంగా ‘రంగస్థలం’లో తాను నటించిన రామలక్ష్మి పాత్ర అయితే.. నెక్ట్స్ లెవల్. కెరీర్ 14ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా తాను నటించిన పాత్రల గురించి అభిమానులతో ముచ్చటించారు సామ్. రామలక్ష్మి పాత్ర గురించి ఆసక్తికరంగా మాట్లాడింది. ‘ఆ పాత్రకు నన్ను అనుకోగానే సుకుమార్ టీమ్‌లోనే చాలామంది అనుమానాలు వ్యక్తం చేశారట. ఎందుకంటే రామలక్ష్మి పల్లెటూరి అమ్మాయి. నేను అప్పటివరకూ చేసిన పాత్రలన్నీ రామలక్ష్మికి పూర్తి భిన్నమైనవి. రామలక్ష్మి మాటతీరు.. ఆటిట్యూట్ అంతా భిన్నంగా ఉంటాయి. అందుకే వాళ్లు నాలో రామలక్ష్మిని చూడలేకపోయారు. కానీ సుకుమార్ చూశారు. కాబట్టే ప్రపంచం చూసింది. అందరూ మెచ్చుకున్నారు కూడా. డీ గ్లామరైజ్డ్ కేరక్టరే అయినా.. రామలక్ష్మిలో ఏదో తెలియని అందం. నన్నడిగితే నా మిగతా కేరక్టర్ల కంటే రామలక్ష్మే అందగత్తె’ అంటూ చెప్పుకొచ్చింది సామ్.

70 ఏండ్ల వృద్ధుడి పాత్రలో..

మెగాస్టార్ చిరంజీవి కథానాయకుడిగా ‘బింబిసార’ ఫేమ్ వశిష్ట దర్శకత్వంలో తెరకెక్కుతున్న సోషియో ఫాంటసీ చిత్రం ‘విశ్వంభర’. చిరంజీవి నటిస్తున్న 156వ సినిమా ఇది. యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. పంచభూతాలు, ముల్లోకాల కాన్సెప్ట్స్ ప్రధానంగా ఫాంటసీ అడ్వెంచరస్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతున్నది. కొద్ది రోజుల క్రితం విడుదల చేసిన కాన్సెప్ట్ వీడియో సినిమాపై మరింతగా అంచనాలను పెంచింది. ఫాంటసీ చిత్రం కావడంతో చిరంజీవి పాత్ర ఎలా ఉంటుందోనని అభిమానులు ఉత్సుకతగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం ఈ సినిమాలోని కీలకమైన ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్‌లో చిరంజీవి డెబ్బై ఏండ్ల వృద్ధుడి పాత్రలో కనిపిస్తాడని, కథాగమనంలో ఆ సన్నివేశాలు కీలకంగా ఉంటాయని చెబుతున్నారు. ఆ ఎపిసోడ్ తాలూకు విజువల్స్ కూడా అబ్బురపరిచే రీతిలో ఉంటాయని సమాచారం. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకురానుంది.

ప్రముఖ గాయకుడు పంకజ్ ఉదాస్ కన్నుమూత

గజల్ మేస్ట్రోగా ప్రసిద్ధుడైన ప్రముఖ గాయకుడు పంకజ్ ఉదాస్(72) సోమవారం ముంబయిలో కన్నుమూశారు. ఆయన మే 17, 1951న గుజరాత్‌లోని జెటూర్‌లో జన్మించారు. 80, 90దశకంలో గజల్, నేపథ్య గాయకుడిగా మరపురాని పాటలను ఆలపించారు. ‘తుమ్ హసీన్ మే జవాన్’ (1970) సినిమా ద్వారా నేపథ్య గాయకుడిగా సినీ ప్రయాణాన్ని మొదలుపెట్టారు. ‘నామ్’ చిత్రంలో ఆలపించిన ‘చిట్టి ఆయీ హై’ గీతం చాలా పాపురల్ అయింది. ‘గంగా జమున సరస్వతి’ ‘ఘాయల్’ ‘సాజన్’ ‘బేటా’ ‘దిల్ అప్నా హై’ ‘బాజీఘర్’ చిత్రాల్లో అద్భుతమైన పాటలను ఆలపించారు. ప్రైవేట్ ఆల్బమ్స్ ద్వారా గజల్ సింగర్‌గా ప్రసిద్ధుడైన ఆయన సినీ నేపథ్య గాయకుడిగా తనదైన ముద్రను వేశారు. 2006లో భారత ప్రభుత్వం పంకజ్ ఉదాస్‌ను పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

రిపోర్టర్ లక్ష్మిగా అలరిస్తా

‘హీరోయిన్ కావాలనేది నా చిన్ననాటి కల. సినిమాలంటే పిచ్చి. అందుకే ఎంతో కష్టపడి సినిమాల్లోకి వచ్చాను. నా కల నిజమైనందుకు దేవుడికి థాంక్స్ చెప్పుకుంటున్నాను’ అంటున్నది ఢిల్లీభామ రాశి సింగ్. ఆమె కథానాయికగా నటించిన చిత్రం ‘భూతద్దం భాస్కర్ నారాయణ’. శివ కందుకూరి కథానాయకుడిగా నటించిన ఈ చిత్రానికి పురుషోత్తం రాజ్ దర్శకుడు. స్నేహల్, శశిధర్, కార్తీక్ నిర్మాతలు. మార్చి 1న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా రాశి విలేకరులతో ముచ్చటించింది. ‘మాది రాయపూర్. ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకున్నాను. ఏడాది కాలం పాటు ఎయిర్ హోస్టెస్‌గా చేశాను. సంతోశ్‌శోభన్ ‘ప్రేమ్‌కుమార్’ ఓటీటీ ఫిల్మ్‌తో హీరోయిన్ అయ్యాను. ఆహాలో ‘పాపం పసివాడు’ చేశాను. వాటిల్లో నా నటన నచ్చే కథానాయికగా తీసుకున్నారు దర్శకుడు శివ కందుకూరి’ అని తెలిపారు రాశి. ఇంకా చెబుతూ ‘ఇందులో నా పాత్ర పేరు లక్ష్మి. గాశ్ నెక్స్ట్ డోర్ లాంటి పాత్ర. ప్రెస్ రిపోర్టర్‌గా కనిపిస్తాను. కథలో నా పాత్ర చాలా బలంగా ఉంటుంది. రొమాంటిక్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా దర్శకుడు ఈ సినిమాను తెరెక్కించాడు. క్లైమాక్స్‌ని అస్సలు ఊహించలేరు’ అని చెప్పారు. హైదరాబాద్, టాలీవుడ్ ఫిల్మ్ ఇండస్ట్రీ.. ఈ రెండూ తనకు చాలా ఇష్టమని, అందుకే ముంబయి నుండి వచ్చి ఇక్కడే సెటిల్ అయ్యానని, తెలుగు కూడా నేర్చుకుంటున్నానని రాశి సింగ్ చెప్పుకొచ్చింది.

జో జో లాలీ అమ్మ..

‘కలియుగం పట్టణంలో’ పేరుతో ఓ చిత్రం రానుంది. విశ్వ కార్తీక్, ఆయూషి పటేల్ జంటగా నటిస్తున్న ఈ చిత్రంలో చిత్రాశుక్ల ప్రధాన పాత్ర పోషిస్తున్నది. రమాకాంత్‌రెడ్డి దర్శకుడు. కథ, కథనం, మాటలు కూడా ఆయనే అందిస్తుండటం విశేషం. కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి, జి.మహేశ్వరరెడ్డి, కాటం రమేశ్‌లు నిర్మాతలు. మార్చి 22న సినిమా విడుదల కానుంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా ‘జో జో లాలీ అమ్మ..’ అంటూ సాగే గీతాన్ని దర్శకుడు వశిష్ట విడుదలచేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. భాస్కరభట్ల రాసిన ఈ పాటను అజయ్ అరసాడ స్వరపరచగా, అనురాగ్ కులకర్ణి ఆలపించారు. ఈ పాట సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని మేకర్స్ చెబుతున్నారు. పోస్ట్‌ప్రొడక్షన్ కూడా చివరి దశకు చేరుకుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా చరణ్ మాధవనేని.

కన్నడ డైరెక్టర్ రవిగౌడ్ మృతి

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 26 : రాజన్న సిరిసిల్ల జిల్లా బొప్పాపూర్‌కు చెందిన చిదుగు రవిగౌడ్(35) బ్రెయిన్ స్ట్రోక్‌తో సోమవారం హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానలో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. రవిగౌడ్ దర్శకుడు పూరీ జగన్నాథ్ స్ఫూర్తితో సినిమాలపై మక్కువ పెంచుకుని అసోషియేట్ డైరెక్టర్‌గా ఎదిగి కర్ణాటక చిత్ర రంగంలో అడుగు పెట్టి కొంత కాలం బెంగుళూరులో ఉన్నాడు. 2021లో కన్నడ హీరో కన్నడ ప్రభాకర్ కొడుకు వినోద్ ప్రభాకర్‌తో షాడో సినిమాను తీశాడు. కరోనా కారణంగా ఆ సినిమా డిజాస్టర్‌గా మిగిలిపోగా అప్పుల పాలయ్యాడు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన రవిగౌడ్ అనారోగ్యం బారిన పడ్డాడు. 15 రోజుల క్రితం హైదరాబాద్‌లో అస్వస్థతకు గురికాగా, కుటుంబ సభ్యులు నిమ్స్ దవాఖానలో చేర్పించారు. సోమవారం బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. సినిమా రంగంలో ఎదుగుతున్నాడని గ్రామస్థులు భావించిన తరుణంలో రవిగౌడ్ మృతి బొప్పాపూర్‌లో తీవ్ర విషాదం మిగిల్చింది.

స్ఫూర్తిదాయకమైన కథాంశంతో..

నిహాన్, వైష్ణవి కాంబ్లే జంటగా నటిస్తున్న చిత్రం ‘మా ఊరి రాజారెడ్డి’. రవి బాసర దర్శకుడు. ఆర్‌ఎస్ మూవీ మేకర్స్ పతాకంపై రజిత రవీంద్ర ఎర్ర, సునీత వెంకట రమణ నిర్మిస్తున్నారు. మార్చి 1న ప్రేక్షకుల ముందుకు రానుంది. సోమవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. నిర్మాత మాట్లాడుతూ ‘నిర్మల్ పరిసర ప్రాంతాల్లో ఈ సినిమా షూటింగ్ జరిపాం. కథలోని భావోద్వేగాలు ఆకట్టుకుంటాయి’ అన్నారు. రాజా రెడ్డి అనే వ్యక్తి స్ఫూర్తిదాయక జీవిత ప్రయాణాన్ని ఈ సినిమాలో ఆవిష్కరించామని కో డైరెక్టర్ రవీంద్ర సిద్ధార్థ తెలిపారు. అభినయ ప్రధాన పాత్రల్లో నటించడం ఆనందంగా ఉందని నాయకానాయికలు తెలిపారు. ఎర్ర రవీందర్, రజని తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: వాసు, సంగీతం: పీకే, దర్శకత్వం: రవి బాసర.

‘రాధా మాధవం’ ప్రేమకథ

వినాయక్ దేశాయ్, అపర్ణాదేవి జంటగా నటిస్తున్న చిత్రం ‘రాధా మాధవం’. దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని గోనాల్ వెంకటేష్ నిర్మించారు. మార్చి 1న ప్రేక్షకుల ముందుకురానుంది. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ ‘నిజ జీవిత ఘటనల ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. హృద్యమైన ప్రేమకథగా మెప్పిస్తుంది. ఇప్పటికే విడుదలైన టీజర్, ట్రైలర్‌కు మంచి స్పందన లభిస్తున్నది’ అని చెప్పారు. గ్రామీణ నేపథ్య ఫీల్‌గుడ్ లవ్‌స్టోరీగా ప్రేక్షకులకు కొత్త అనుభూతిని పంచుతుందని, చక్కటి నిర్మాణ విలువలతో తెరకెక్కించామని నిర్మాత గోనాల్ వెంకటేష్ పేర్కొన్నారు.